## క్లుప్తంగా...

### కరెంటు ఉండని ప్రాంతాలు

మల్లాపూర్: వైజయంతి 11కేవీ ఫీడర్ పరిధి, 33/11 కేవీ నాచారం ఇండోర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఫీడర్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు బాబానగర్, రవీందర్‌నగర్, దుర్గానగర్, కార్తికేయనగర్, కాలనీలో కరెంటు ఉండదని ఏఈ దశరథ్ తెలిపారు.

ఏఎస్‌రావునగర్ సబ్‌స్టేషన్ పరిధిలో..

కుషాయిగూడ: ఏఎస్‌రావునగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శనివారం కరంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సీహెచ్ అర్చన శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11 కేవీ ఏఎస్‌రావునగర్ ఫీడర్ పరిధిలోని ఎంబిజీ, హెచ్ఐజీ పార్కులో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, 11 కేవీ గాంధీనగర్ ఫీడర్ పరిధిలోని గాంధీనగర్, ఈస్ట్ ప్రగతినగర్, చందన్‌బాగ్, బొడెబండా, అంబానగర్, గాయత్రినగర్, ఎంజేకాలనీ, గాయత్రినగర్ రోడ్డు నెంబర్లు 2, 3, 4, జే కాలనీ రోడ్డు నెంబర్లు 5, 6 ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కరెంటు ఉండదన్నారు.

ఆనంద్‌బాగ్ సబ్‌స్టేషన్ పరిధిలో..

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్ సబ్‌స్టేషన్ 11 కేవీ పీబీ కాలనీ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జైన్ మందిర్, ఎన్‌బీహెచ్ కాలనీ, చంద్రగిరికాలనీ, సంతోషిమానగర్, సింహాద్రినగర్, పీబీకాలనీ, స్విమ్మింగ్ పూల్, సుధానగర్, ద్వారకామాయి కాలనీ, నిషి చర్చ్ ప్రాంతాల్లో కరెంటు ఉండదని ఏఈ రమేష్ తెలిపారు. 11 కేవీ కృపానంద్ అపార్ట్‌మెంట్స్ ఫీడర్ పరిధిలోని ఆనంద్ బాగ్, ఏడీఆర్ ఆస్పత్రి, లాల్‌వాణీనగర్, కృపానంద్ అపార్ట్‌మెంట్స్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కరెంటు ఉండదన్నారు.

### 501 చీరలతో అమ్మవారి అలంకరణ



బోడుప్పల్: బోడుప్పల్ పెంటారెడ్డిలోని నిమిషాంబదేవి అమ్మవారిని శ్రావణ మాసం మొదటి శుక్రవారం పురస్కరించుకుని 501 చీరలతో అలంకరించారు. విశేష అలంకరణతో పాటు మహా మంగళ హారతి, ప్రత్యేక పూజలు, నీరాజనం, మంత్రపుష్పం కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ వినోద్‌కుమార్ వర్మ, ప్రధాన కార్యదర్శి అశోక్‌కుమార్, సభ్యులు శ్రీనివాస్, శ్యాం, శ్రీకాంత్, సతీష్, హేమ చందర్, రాము, మోహన్, ఆలయ ప్రధాన అర్చకులు చంద్రశేఖర్ శర్మ పాల్గొన్నారు.

### పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటుదాం



మొక్కలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్

బోడుప్పల్: పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని 13వ డివిజన్ కార్పొరేటర్ దానగల్ల అనిత యాదగిరి అన్నారు. బోడుప్పల్ అన్నపూర్ణ కాలనీలో శుక్రవారం ఆమె ఇంటింటికి మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంటికీ 4 మొక్కలు అందజేస్తున్నామని, వాటిని నాటి పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో అన్నపూర్ణ కాలనీ అధ్యక్షుడు ప్రభాకర్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు గోపు రాము, రాఘవ, ప్రసాద్‌రావు, నర్సింహారావు, శంకర్ కాలనీవాసులు పాల్గొన్నారు.

### పోస్టర్ ఆవిష్కరణ



మల్లాపూర్: పెరిక కులస్తుల ఆత్మగౌరవ భవనం భూమిపూజ పోస్టర్‌ను మల్లాపూర్ మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వద్ద ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కోకాపేట్‌లో నిర్వహించే కార్యక్రమానికి పెద్దఎత్తున పెరిక కులస్తులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆత్మగౌరవ బిల్డింగ్ కమిటీ చైర్మన్ గటిక విజయ్‌కుమార్, ఉప్పల్ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శి బుసాని రఘు, దాచేపల్లి శ్రీధర్, పెరిక సంఘ నేతలు మనోహర్, ఆనంద్, పరమేష్, సతీష్, రఘు, గరిక సుధాకర్, అశోక్, వెంకటేష్ పాల్గొన్నారు.



ఓల్డ్ అల్వాల్‌లో పాపన్న జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు



ఈసీఐఎల్ చౌరస్తాలో బీఆర్ఎస్ సీనియర్ నేత బండారి లక్ష్మారెడ్డి

# ఘనంగా పాపన్నగౌడ్ జయంతి వేడుకలు

అల్వాల్/గౌతంనగర్: సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ సేవలు మరువలేనవని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు అన్నారు. ఓల్డ్ అల్వాల్ ఇందిరాగాంధీ చౌరస్తాలో అల్వాల్ గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు ముఖ్య అతిథిగా హాజరై పాపన్న గౌడ్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్పొరేటర్లు చింతల శాంతి శ్రీనివాస్‌రెడ్డి, రాజ్ జితేంద్రనాథ్, అల్వాల్ గౌడ సంఘం ప్రతినిధులు నేమూరి సాయిరాంగౌడ్, కొండల్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రవిగౌడ్, పి.శ్రీనివాస్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, పరమేష్, పుట్నాల కృష్ణ, ఉదయ్, శోభన్, వీవీ రావు, నాగేశ్వరరావు, శ్రీశైలం యాదవ్, బబిత, సులోచన, ఉదయ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సంజయ్‌నగర్‌లో..

గౌతంనగర్ డివిజన్ పరిధిలోని సంజయ్‌నగర్‌లో సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ నివాళులర్పించారు. కార్యక్రమంలో జీడీ. శ్రీనివాస్‌గౌడ్, వాసగోని శ్రీనివాస్‌గౌడ్, నరేందర్‌గౌడ్, మహేందర్‌గౌడ్, నాగేష్‌గౌడ్, శంకర్‌గౌడ్, జీడి.సత్యనారాయణగౌడ్, గుత్తి రాంచందర్ పాల్గొన్నారు.

ఉప్పల్‌లో..

ఉప్పల్: సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి ఉత్సవాలు ఉప్పల్‌లో ఘనంగా జరిగాయి. నెర్లం భాస్కర్‌గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉత్సవాలకు బీఆర్ఎస్ ఉప్పల్ నియోజకవర్గ సీనియర్ నాయకుడు బండారి లక్ష్మారెడ్డి హాజరైన ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ హాజరైన నివాళులర్పించారు. ఆకుల మహేందర్, మేకల హనుమంతరెడ్డి, గజ్జెల సత్యరాజ్‌గౌడ్, నవీన్‌గౌడ్, తెలంగాణ సంపత్, పుప్పాల వెంకటేశ్వర్లు, జగన్‌గౌడ్ తదితరులు నివాళులర్పించారు.

చర్లపల్లి, మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్లలో..

కుషాయిగూడ: చర్లపల్లి, మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్లలో సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసీఐఎల్ చౌరస్తాలోని నిర్వహించిన కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నేత బండారి లక్ష్మారెడ్డి హాజరై నివాళులర్పించారు. హెచ్‌బీకాలనీలో కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేశారు. గౌడసంఘం ప్రతినిధులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

వెంకటరెడ్డినగర్‌లో..

రామంతాపూర్: వెంకటరెడ్డినగర్‌లో స్థానిక గౌడ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ పాల్గొని పాపన్న విగ్రహానికి నివాళులర్పించారు. గౌడ సంఘం సభ్యులు వేములకొండ వెంకన్న, గడ్డం సాయి కిరణ్, హనుమంతరావు, సోమశేఖర్‌గౌడ్, శివగౌడ్, వినయ్, అనిల్, బాలకృష్ణగౌడ్ పాల్గొన్నారు.

మల్లాపూర్‌లో..

మల్లాపూర్, మీర్‌పేట్ గౌడ్ సంఘం ఆధ్వర్యంలో కౌండిన్య భవన్ వద్ద సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని నిర్వహించారు. తీగుళ్ల శ్రీనివాస్‌గౌడ్, బొంగొని ఉమేష్ గౌడ్, మక్తాల బాలరాజ్‌గౌడ్, అచ్చంగోని సతీష్‌గౌడ్, కరుణాకర్ గౌడ్, పచ్చిమట్ల నర్సింగ్ గౌడ్, వేణుగౌడ్, నిక్కి గౌడ్, రాజుగౌడ్, వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



గౌతంనగర్‌లో నివాళులర్పిస్తున్న నందికంటి శ్రీధర్



చిలుకానగర్ రోడ్డులో నివాళులర్పిస్తున్న బండారి లక్ష్మారెడ్డి, భాస్కర్ తదితరులు



నేరేడ్‌మెట్‌లో నివాళులర్పిస్తున్న బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఆకుల రాజేందర్

# అభివృద్ధి పనుల్లో అలసత్వం వద్దు



సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు



సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే మైనంపల్లి

అల్వాల్: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. రాజీవ్ వీకర్ సెక్షన్ ఇందిరానగర్ కాలనీలో రూ.25 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన స్థానిక కార్పొరేటర్ సబితా కిషోర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధి నిర్మాణ పనుల్లో అలసత్వం వీడి నిర్ణీత సమయానికి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. నాయకులు అనీల్‌కిషోర్‌గౌడ్, మోసీన్, టీవీ.భాస్కర్, రఘునాథ్, లక్ష్మణ్, అమృత, స్వప్న, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ అధికారంలో బీఆర్ఎస్సే..

మల్కాజిగిరి: రాబోయే ఎన్నికల్లో ఘనవిజయం సాధించి మళ్లీ అధికారంలోకి వస్తామని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. శుక్రవారం ఈస్ట్‌ఆనంద్‌బాగ్ డివిజన్ జవహర్‌నగర్‌లో కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్‌తో కలిసి రూ.20 లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. డీఈ లౌక్య, ఏఈ శ్రీకాంత్, వీఐ రజనీకాంత్, పరశురామిరెడ్డి, జీఎన్వీ సతీష్ కుమార్, సత్యమూర్తి, పిట్ల శ్రీనివాస్, సంపత్, బాబు, సత్యనారాయణ, కిషోర్ పాల్గొన్నారు.

క్రీడలకు సమయాన్ని కేటాయించాలి

క్రీడలు, వ్యాయామానికి సమయం కేటాయించడంతో ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని ఎమ్మెల్యే మైనంపల్లి అన్నారు. శుక్రవారం ఓల్డ్ మల్కాజిగిరిలో ఎల్ఎన్ స్పోర్ట్స్ ఎరినాను ఆయన ఏసీపీ నరేష్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు.

## సమస్యలను పరిష్కరించండి

మల్కాజిగిరి: డివిజన్ పరిధిలోని కాలనీల్లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ అధికారులకు సూచించారు. శుక్రవారం తన కార్యాలయంలో జీహెచ్ఎంసీ ఏఈ దీపక్, విద్యుత్ విభాగం ఏడీఈ యాదగిరి, జలమండలి మేనేజర్ వేణుగోపాల్‌తో సమావేశం నిర్వహించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ సీతారాంనగర్, బలరాంనగర్ ప్రాంతాల్లో విద్యుత్ తీగలకు తాకుతున్న చెట్ల కొమ్మలను తొలగించాలని, ఓల్డ్ మల్కాజిగిరిలో మంచినీటి సరఫరాలో ప్రెజర్ పెంచాలని, డివిజన్ పరిధిలోని కొన్ని కాలనీల్లో సీసీ రోడ్లు, పార్కుల అభివృద్ధికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సూచించామన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



మేడిపల్లి: పేద, మధ్యతరగతి ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ వరంలా మారిందని, ప్రజల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని మేయర్ జక్కా వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి పలువురికి మంజూరైన చెక్కులను మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఆయన అందజేశారు. నాయకులు ఈశ్వర్‌రెడ్డి, బండారు రవీందర్ తదితరులు ఉన్నారు.

# న్యాయమైన డిమాండ్లను సాధించుకునే వరకు సమ్మె



ఉప్పల్: జీహెచ్ఎంసీ ఉప్పల్‌లో పనిచేసే దాదాపుగా 560 మంది పారిశుద్ధ్య కార్మికులు శుక్రవారం సమ్మెకు దిగారు. శుక్రవారం విధులను బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. న్యాయమైన డిమాండ్లను సాధించుకునే వరకు సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు మాట్లాడుతూ కేసీఆర్ గద్దెనెక్కిన తర్వాత జీహెచ్ఎంసీ కార్మికులను పర్మినెంట్ చేస్తామని మొదటి ఫైల్‌పై సంతకం చేసి ఇంత వరకు ఊసెత్తకపోవడం దారుణమని అన్నారు. న్యాయమైన డిమాండ్ల సాధించుకునే వరకు సమ్మె కొనసాగుతుందని, విధుల్లోకి చేరబోమని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఉప్పల్ సర్కిల్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు. సమ్మెకు ఉప్పల్ సర్కిల్ సీపీఎం నాయకులు ఎర్రం శ్రీనివాస్ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు.

## రూమ్‌మేట్‌ను హత్యచేసిన వ్యక్తికి రిమాండ్

మల్లాపూర్: మల్లాపూర్ న్యూభవానీ నగర్‌లో ఈ నెల 15వ తేదీన జరిగిన హత్య కేసును నాచారం పోలీసులు ఛేదించారు. నాచారం ఇన్‌స్పెక్టర్ నందీశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం న్యూభవానీ నగర్‌లో ఆగాచారి ఇంట్లో బిహార్ రాష్ట్రానికి చెందిన నందలాల్ ప్రజాపతి(34) హత్యకు గురయ్యాడు. అదే రూమ్‌లో ఉండే రజింత్‌యాదవ్(45) పరారయ్యాడు. ఇంటి యాజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. పోలీసులు రంజిత్ యాదవ్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. మద్యానికి డబ్బుల విషయంలో గొడవ జరిగిందని, ప్రజాపతి డబ్బుల కోసం వేధిస్తుండగా భరించలేక కూరగాయలు కోసే కత్తితో హత్య చేసినట్లు విచారణలో ఒప్పుకున్నాడు. రజింత్ యాదవ్‌ను పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

# లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో 'మౌంట్ ఫోర్ట్ లిట్ ఫెస్ట్'



ఉప్పల్: ఉప్పల్ లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో శుక్రవారం 'మౌంట్ ఫోర్ట్ లిట్ ఫెస్ట్' పేరుతో సాహిత్య, సాంస్కృతిక పోటీలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీనియర్ ప్రిన్సిపల్ సైంటిస్టు ప్రొఫెసర్ డాక్టర్ కె.రామ్మోహన్ విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సృజనాత్మకత, ఆలోచన శక్తిని పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. ఉన్నత ఆశయాలతో ముందుకెళ్తూ అభివృద్ధి బాటలో నడవాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న పాఠశాల ప్రిన్సిపల్ జోసెఫ్ విద్యార్థులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన వ్యాస రచన, వక్తృత్వ, పోస్టర్ తయారీ, నాటక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

## వ్యభిచార ముఠా అరెస్టు

అల్వాల్: గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచారం నిర్వహిస్తున్న శిబిరంపై పోలీసులు దాడి చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్వాల్ వెంకటాపురం మారుతినగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు దాడి చేసి ఆరుగురు మహిళలు, ముగ్గురు విటులు, ఇద్దరు నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి మహిళలను తీసుకువచ్చి వ్యభిచారం నిర్వహిస్తున్నారు. మహిళలను బోడుప్పల్‌లోని సఖీ కేంద్రానికి తరలించారు. ముగ్గులు విటులు, ఇద్దరు నిర్వాహకులను రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

## బకాయిలను వసూలు చేయాలి



అల్వాల్: అల్వాల్ సర్కిల్ కార్యాలయంలో ఉప కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డితో శుక్రవారం మున్సిపల్ సిబ్బందితో సమావేశం జరిగింది. అల్వాల్ మున్సిపల్‌కు రావాల్సిన ట్యాక్స్ బకాయిలను వసూలు చేయాలని సిబ్బందిని కోరారు. రాబోయే ఎన్నికల ప్రక్రియకు ఓటర్ లిస్టును సక్రమంగా తయారు చేయాలని ఆయన సూచించారు. ఏఎంసీ శ్రీనివాస్‌రెడ్డి, స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

# ఒక్క నిరుపేదకూ డబుల్ ఇల్లు ఇవ్వలే..



మహాధర్నాలో ప్రభాకర్ తదితరులు

మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్

రామంతాపూర్: రాష్ట్రంలో పేదల కోసం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను పార్టీ కార్యకర్తలు, నేతలకు కేటాయిస్తూ పేదలను బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేస్తోందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ అన్నారు. శుక్రవారం రామంతాపూర్ ప్రధాన రహదారి హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ వద్ద డబుల్ బెడ్ రూమ్‌లు పేదలకు కేటాయించాలని బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించి 48 గంటల నిరసన ధర్నాలో ఆయన కార్పొరేటర్లు బీజేపీ నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇదిగో.. అదిగో.. డబుల బెడ్ రూమ్ ఇళ్లు అంటూ పేద ప్రజలను టీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదేళ్లుగా మభ్యపెడుతూ పబ్బం గడుపుకుంటూ ఓట్లు దండుకుంటున్నారు తప్ప ఏ ఒక్క నిరుపేదకు ఇల్లు అందలేదని అన్నారు. ఉప్పల్ నియోజకవర్గంలో కొన్ని డివిజన్లలో బీఆర్ఎస్ కార్పొరేటర్లు అవినీతి అక్రమాలు, కబ్జాలకు పాల్పడుతూ పేద, మధ్య తరగతి ప్రజలు ఎవరైనా ఇల్లు కట్టుకునేందుకు పునాదులు తీయగానే కార్పొరేటర్లు, వారి అనుచరులు గద్దల్లా వాలిపోయి అందిన కాడికి దోచుకుంటున్నారన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాగానే మొట్టమొదట అర్హులైన పేదలకు ఇల్లు కట్టిస్తామని ఆయన అన్నారు. రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వ పెద్దలు ప్రజాప్రతినిధులు నేతలు అందిన కాడికి దోచుకో.. దాచుకో పద్ధతిలో నడుస్తూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విస్మరిస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ పాలన పట్ల ప్రజలు విసుగెత్తిపోయారని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీకి ప్రజలు పట్టం కట్టడం ఖాయమని తెలిపారు. కార్పొరేటర్లు కక్కిరేణి చేతన హరీష్, బండారు శ్రీవాణి వెంకట్‌రావు, ఉప్పల్ అసెంబ్లీ కన్వీనర్ దేవసాని బాలచందర్, డాక్టర్ శిల్పారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు హరీష్, వెంకట్రావ్, హనుమంతరావు, శ్రీనివాస్‌చారి, పలువురు బీజేపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పాదయాత్ర



నాచారంలో పాదయాత్రలో ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, కార్పొరేటర్ శాంతి సాయిజెన్

మల్లాపూర్: నాచారం డివిజన్‌లో రెండవ రోజు ఎమ్మెల్యే పాదయాత్ర జోరుగా హుషారుగా కొనసాగింది. నాచారం ఓల్డ్ విలేజ్, అంబేడ్కర్‌నగర్, న్యూ అంబేడ్కర్‌నగర్, శ్రీరామ్‌నగర్, గాంధీనగర్, ఎర్రకుంట, ఎరుకల బస్తీ, కౌండిన్యనగర్, కాలనీలో జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్‌తో కలిసి ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి ఇంటింటికీ తిరిగి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోనే నాచారం డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతామని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు మేకల ముత్యంరెడ్డి, ప్రధాన కార్యదర్శి అంజి, బీఆర్ఎస్ సీనియర్ నేతలు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శాంతి భద్రతలను పరిరక్షణకు పెద్దపీట



అడిషనల్ డీసీపీగా బాధ్యతలు స్వీకరించిన ఎన్.వెంకటరమణ

అడిషనల్ డీసీపీగా బాధ్యతలు స్వీకరించిన వెంకటరమణ

కుషాయిగూడ: శాంతిభద్రతల పరిరక్షణకు పెద్దపీట వేయనున్నట్లు రాచకొండ కమిషనరేట్, మల్కాజిగిరి జోన్ అడిషనల్ డీసీపీ ఎన్.వెంకటరమణ అన్నారు. కుషాయిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన రాచకొండ, మల్కాజిగిరి జోన్ అడిషనల్ డీసీపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన కుషాయిగూడ ఏసీపీ వై.వెంకట్‌రెడ్డితో కలిసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద బ్రాహ్మణుల ఆశీర్వచనాలతో బాధ్యతలు స్వీకరించిన అనంతరం మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో చోటు చేసుకుంటున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా పోలీసుశాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాల పట్ల ప్రజలను చైతన్య పరుస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కుషాయిగూడ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ ఉపేందర్‌యాదవ్, పారిశ్రామికవేత్త లయన్ సురేష్‌కుమార్, లయన్స్ క్లబ్ ఆఫ్ బాగ్యనగర్ గ్రీన్‌సిటీ అధ్యక్షుడు వడ్లోజు జ్యోతిర్మయాచారి, స్థానిక నేతలు బోదాసు రవి, విజయ్‌గౌడ్, నవీన్‌నాయుడు, కనకరాజుగౌడ్, విద్యాసాగర్, రాజేశ్వర్‌రెడ్డి, రెడ్డి శ్రీనివాసరావు, మాకవరం శ్రీదేవి, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ ప్రభుత్వ పాలన అధ్వాన్నం

మల్కాజిగిరి: తొమ్మిది సంవత్సరాల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలన అధ్వానంగా తయారైందని మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఆకుల రాజేందర్ అన్నారు. శుక్రవారం ఆనంద్‌బాగ్‌లో బీజేపీ మల్కాజిగిరి శాఖ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నప్పటికీ ప్రజల కలలు నెరవేర్చుకోలేకపోయామన్నారు. బంగారు తెలంగాణ చేస్తామన్న పాలకులు కనీస అవసరాలు తీర్చలేకపోయారన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో నాయకులు సదానంద్‌గౌడ్, ఆర్.కె. శ్రీనివాస్, భాను ప్రకాష్, వి.కె.మహేష్, వాశంశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## భాగ్యనగర్ గ్రీన్‌సిటీ అధ్యక్షుడిగా జ్యోతిర్మయాచారి



కుషాయిగూడ: లయన్స్ క్లబ్ ఆఫ్ భాగ్యనగర్ గ్రీన్ సిటీ అధ్యక్షుడిగా సీనియర్ జర్నలిస్టు వడ్లోజు జ్యోతిర్మయాచారి నియమితులయ్యారు. సెక్రటరీగా విష్ణుసాయి ప్రసాద్, కోశాధికారిగా భానుప్రకాష్, సభ్యులుగా ఎం.విజయ్‌గౌడ్, బోదాసు రవి, నవీన్‌నాయుడు, సునీల్‌చారి నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు జ్యోతిర్మయాచారి మాట్లాడుతూ తనవంతుగా సమాజానికి సేవ చేయాలనే తపనతో లయన్స్ క్లబ్ చేరినట్లు తెలిపారు. గత సభ్యుల అనుభవాలు, సలహాలు, సహకారంతో సేవా కార్యక్రమాలను రూపొందించుకొని ముందుకు సాగుతామన్నారు.

## స్వచ్ఛత అందరి బాధ్యత

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్యాలయంలో మేయర్ జక్క వెంకట్‌రెడ్డి, కమిషనర్ ఇస్లావత్ నమ్య ఆధ్వర్యంలో శుక్రవారం వివిధ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. నగరాన్ని స్వచ్ఛ పీర్జాదిగూడగా నిర్మించాలనే లక్ష్యంతో ప్రజలు తడి, పొడిచెత్త, హానికర చెత్తను స్వచ్ఛ ఆటోలకు అందిస్తున్నారని అన్నారు. కొంతమంది రాత్రి వేళలో బహిరంగ ప్రదేశాలు, రోడ్లపై చెత్త వేస్తున్నారని, ఆ ప్రదేశాల్లో సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. ఆస్తిపన్నుతో పాటు ట్రేడ్ లైసెన్సుల ఫీజులు కూడా వసూలు చేయడం, ట్రేడ్ లైసెన్సు లేని వ్యాపారులకు లైసెన్సులు జారీ చేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్ఓ శ్రీనివాస్‌రెడ్డి, ఏసీపీ శ్రీనివాస్, ఏఈ భిక్షపతి, మేనేజర్ జ్యోతిరెడ్డి, ఇంజినీరింగ్ అధికారులు, బిల్ కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.



పీర్జాదిగూడ మున్సిపల్ కార్యాలయంలో మేయర్ జక్క వెంకట్‌రెడ్డి తదితరులు